# చేదువిషం-జీవఫలం

"హలో! ప్రసాద్!" బన్వర్‌లాల్ బట్టల దుకాణం ముందు కారాపి లోపలికి వెళ్ళబోతున్న ప్రసాద్ వెనుదిరిగి చూశాడు. మూర్తిని చూస్తూనే ప్రసాద్ ముఖం విప్పారింది. సంతోషంగా చేయి చాచాడు.

"మూర్తీ! నీవేనా? వాట్ ఎప్లెజంట్ సర్‌ప్రైజ్!" స్నేహితుని బుజం తడుతూ ఆప్యాయంగా పలకరించాడు ప్రసాద్. "ఏంరా యిన్నాళ్ళయింది ఒక్క ఉత్తరమన్నా రాశావా! ఆఖరికి నా వెడ్డింగ్ ఇన్విటేషన్‌కి కూడా జవాబీయలేదు గదూ!" నిష్ఠూరంగా అన్నాడు ప్రసాద్.

"సారీ ప్రసాద్. నీ పెళ్ళి శుభలేఖ అందేవేళకి నేను రెండు నెలలు శలవుమీద యింటికి వెళ్ళాను. తరువాత రెండు నెలలకిగాని నీ శుభలేఖ చూడలేదు. అప్పుడయినా నా శుభాకాంక్షలు తెలుపుదా మనుకున్నాను. కాని యేమిటి ఉత్తరాలు రాయడం అంటే నాకెంత ఎలర్జీనో నీకు తెలుసుగదా. అంతేకాక నీ వెక్కడ వున్నావో, ఏం చేస్తున్నావో తెలియక ..." సంజాయిషీ యిచ్చాడు మూర్తి.

"నే నెక్కడ వుండడం యేమిటి? మూడేళ్ళుగా యీ ఊర్లోనే వున్నాను. సర్లే.... జరిగిపోయిందానికి సంజాయిషీలు ఎందుకుగాని, ఇక్క

డికి ఎప్పుడు వచ్చావు ఏం పనిమీద వచ్చావు?" ప్రశ్నలు కురిపించాడు ప్రసాద్.

"ఇక్కడికి రావడం నిన్ననే! నా కీ ఊరు ట్రాన్స్ఫర్ అయింది. నిన్ననే జాయిన్ అయ్యాను డ్యూటీలో! వచ్చిన దగ్గరనుంచి గృహాన్వేషణ లోనే వున్నాను. ఇంకా రేపు మీ ఆఫీసుకివచ్చి నీగురించి వాకబు చేద్దా మనుకుంటున్నాను. ఈ లోపల నీవే కనిపించావు."

"ఏడిశావులే-ఊళ్ళోకివచ్చి తిన్నగా నాదగ్గరకి రాక ఇంకా ఎప్పుడో వద్దామనుకుంటున్నాడుట! ఎందుకురా అబద్ధాలాడతావు. ఇంతేనేరా మన స్నేహం ఒక కంచంలో తిని - మంచంలో పడుకున్నట్లుండే వాళ్ళం. ఆ స్నేహం ఆఖరికి ఉత్తరాలుకూడా రాసుకోలేనంతగా మారిపోయింది. సరే గాని పద యింటికి వెళదాం."

"ఇప్పుడే? రేపు వస్తానేం."

"అదిగో తప్పించుకుందామనుకుంటున్నట్లున్నావు. అదేం కుదరదు. ముందు నడు అట్టే మాట్లాడకుండా. కనిపించాకకూడా వదులుతాననుకున్నావా?" చనువుగా చొరవతో ముందుకు నడిపించాడు ప్రసాద్.

"అన్నట్టు ఒక్క నిమిషం ఉండు. ఈ షాపులో కాస్త పని చూసుకు వెడదాం. రా. లోపలికి!"

బట్టల దుకాణంలో ఏవేవో ఖరీదైన చీరలు తీసి శల్య పరీక్షలు చేశాడు ప్రసాద్. ఒకదానికి బోర్డరు బాగులేదని. యింకోదానికి రంగు బాగు లేదని. జరీ నప్పలేదని. ఖరీదు తక్కువని ఓ అరగంట ఎంచి ఎంచి ఆఖరికి తెల్లటి కంచిపట్టు చీరని దోసెడు ఎర్ర జరీ బోర్డరు వున్న చీర తీశాడు పైకి ప్రసాద్.

"ఎలా వుందంటావు ఈ చీర. బాగుందా. నచ్చిందా నీకు." చీర పమిట చెంగు విప్పి చూస్తూ మూర్తిని అడిగాడు ప్రసాద్.

"బాగుంది నాకు నచ్చడం ఏమిటి. కట్టుకునే వాళ్ళకి, కొనేవాళ్ళకి నచ్చాలిగాని" చిన్నగా నవ్వి అన్నాడు మూర్తి యింతకీ ఆ చీర ఎవరి

కోసం. మీ శ్రీమతికేనా? యిప్పుడేం పండుగలు లేవే. యింత ఖరీదు చీర తీస్తున్నావు దేనికోసం బర్త్‌డేనా?" కుతూహలంగా అడిగాడు మూర్తి.

"ఆ... నీకు చెప్పలేదు గదూ ...యివాళ మా వెడ్డింగ్ యానివర్సరీ అందుకని శ్రీమతికి చీర కొంటున్నాను ...."

"అలాగా.... హార్టీ కంగ్రాచ్యులేషన్స్! విష్ యూ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే స్నేహితుడిని మనసారా అభినందించాడు మూర్తి.

"థేంక్స్. యింతకీ చీర సంగతి చెప్పావు కావు. బాగుందంటావా?"

"నన్నడిగితే నే నేం చెపుతాను. మీ శ్రీమతి రంగు అదీ చూసి నచ్చేది తీసుకో! అఫ్‌కోర్సు, తెల్లచీర ఎలాంటి వారికైనా సరిపోతుం దనుకో."

"చంపావు. మా శ్రీమతి రంగు నలుపా తెలుపా అని సందేహం వచ్చిందా! తెలుపు, తెల్లటి తెలుపు, ఆహాఁ తె లు పు కూ డా కా దు గులాబిరంగు-లైట్ గులాబికలర్! ప్రసాద్ కళ్ళలో గర్వం తొణికిస లాడింది. మూర్తి చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

ప్రసాద్ నూటయాభై రూపాయల బిల్లు చెల్లించి, చీర ప్యాక్ చేయించాడు.

పదరా త్రోవలో కొన్ని పనులున్నాయి చూసుకొని యింటికి వెళ దాం. కారు తిన్నగా ఓ పూల దుకాణం ముందు ఆపి పొడుగ్గా కట్టిన మాలలు కొన్ని, ఓ బుట్టెడు విడిమల్లెలుకొంటున్న ప్రసాద్‌ని ఆశ్చర్యంగా చూశాడు మూర్తి. మతిగాని పోయిందేమిటి.... యిన్ని పువ్వులేంచేస్తావు?

"కావాలిలే.... నీకు తెలియదు" ముసిముసి నవ్వులతో జవాబిచ్చాడు ప్రసాద్.

అక్కడనించి ఓ స్వీట్స్ షాపు ముందు కారాపి రెండు మూడు రకాల స్వీట్స్ పాక్ చేయించాడు ప్రక్కనే వున్న ఫాన్సీషాపునించి మంచి ఓ ఫారెన్ సెంటు సీసా, చందన అగరు వత్తుల పేకెట్టు తీసుకున్నాడు.

ఏమిటొరేయ్! యిదంతా వెడ్డింగ్ యానవర్సరీ అంటే సాక్షాత్తు.... పెళ్ళి రోజులా.... మొదటి రోజు గుర్తు వచ్చేట్టు యధాప్రకారం అన్నీ జరిపిస్తావా ఏమిటి .... ఈ పూలు మిఠాయిలు, సెంట్లు ఏమిటివన్నీ" కొంటెగా అడిగాడు మూర్తి. కొద్దిగా సిగ్గుపడి తల త్రిప్పుకున్నాడు ప్రసాద్.

అది సరేగాని .... కాలేజినాటి నీ గొప్పకబుర్లు అన్నీ ఏమయి పోయాయి. పెళ్ళి పేరు ఎత్తితే మొఖం త్రిప్పుకొనేవాడివి. ఆడపిల్ల కనబడ గానే ఆమడదూరం పారిపోయేవాడివి....ఆడజాతిని నమ్మరాదని ఆజన్మ బ్రహ్మచారిగా వుంటానన్న నీ ప్రతిజ్ఞలన్నీ మీ శ్రీమతిని చూడగానే ఎగిరి చక్కాపోయాయా? నిజంగా నీ పెళ్ళి శుభలేఖ చూచి ఎంత ఆశ్చర్య పోయానో తెలుసా? నీవు అంత సుళువుగా. అంత త్వరలో పెళ్ళి చేసుకుం టావని ఎన్నడూ అనుకోలేదురా"

నిజమేరా మొదట్లో ఆడవాళ్ళంటేనే ఏదో బెరుకుగా సిగ్గుగావుండేది పెళ్ళి, సంసారం ఆ జంజాటం అంటేనే ఏవగింపుగా, భయంగా వుండేది. ఎన్నిసార్లు ఇంట్లోవాళ్ళు ఎంత రభస చేసినా పెళ్ళి చేసుకోడానికే ఇష్టపడ లేదు. ఒకసారి అమ్మ ఒక సంబంధం చెప్పి, నేను చూడడానికి కూడా ఇష్ట పడకపోతే ఉపవాసాలు, నిరశన వ్రతాలు, నిరహారదీక్షలు పూనడంతో ఏదో లాంఛనంగా ఒకసారి చూసి నచ్చలేదని చెప్పేద్దామని వెళ్ళాను .. కాని అక్కడికి వెళ్ళాక చూడకూడదనుకుంటేనే యధాలాపంగా కళ్ళెత్తిన నేను మరి దించలేకపోయాను. ఆ కళ్ళలోని ఆకర్షణకి కట్టుబడిపోయాను, ఏ ముహూర్తాన ఆమెని చూశానో, వనితలేని జీవితమేం జీవితం! అన్నం తగా ఒక్క క్షణంలో మారిపోయాను....

"వనితా!... వనిత పేరా... లేక"

పేరే.... మా శ్రీమతి పేరులే....ఏం ఆశ్చర్యంగా వుందా. మన తెలుగు పేరులా లేదు గదూ! వాళ్ళ నాన్న కలకత్తాలో పని చేస్తుండగా

వనిత పుట్టిందట.... బెంగాళీపేరు పెట్టారు....ఆ....ఏం చెపుతున్నాను. అంతే ఆమెని చూసిన క్షణం ఆమె అందానికి కట్టుబడిపోయా.

"అంత అందగత్తా. మీ శ్రీమతి" కాస్త ఈర్ష్యగాఅడిగాడు మూర్తి "అందానికి నిర్వచనమే వనిత అనుకో! గులాబిరంగు, కవులు వర్ణించే కళ్లు ముక్కు. నల్లటి బారెడు జడ. అదిగో పెళ్ళాన్ని పొగుడుతున్నానని నవ్వు తున్నావు గదూ....

"అబ్బే అదికాదు. తావలచింది రంభ సామెతా, లేక నిజంగానా... అని సందేహం వచ్చింది."

చూస్తావుగా. అప్పుడే నమ్ముదువుగాని నా మాట. వనితని పెళ్ళా డిన దగ్గరనించి నాజీవితం మధురిమతో నిండిపోయింది. ఇదివరకటి జీవితం ఎంత నిస్సారమైందో వనితని పెళ్ళాడాక తెలిసింది. నిజంగా స్త్రీ లేని పురు షుడి జీవితానికి పరిపూర్ణత ఏది?

"ఆ....ఆ... చాల్లే కవిత్వం? పెళ్ళే వద్దన్న నీవు యింతలా మారి పోయావంటే నిజంగా ఆమె చాలా అందగత్తె అయుండాలి.

ఉత్త అందం మాత్రమే కాదు .... నేనంటే ప్రాణం! పెళ్ళయిన మొదటి రోజున యిద్దరం ఎలా వున్నామో....ఈ మూడో సంవత్సరం కూడా అదేలా అంత అన్యోన్యంగా గడుపుతున్నాము, మా దాంపత్యం నిత్య నూతనంగానే వుంది యిప్పటికీ....

"అదృష్టవంతుడివి ప్రసాద్... అన్యోన్యదాంపత్యంకంటె వైవాహిక జీవితంలో కావల్సిందేముంది...."

"అయితే నీ కేమిటి? యింకా బ్రహ్మచర్యవ్రతమే సాగిస్తున్నావా? పెళ్ళి చేసుకోవా ఏమిటి యిప్పటినించి"

"ఆ ...నీలా నాకే వనితలు యింకా తటస్థపడలేదు. వెంటనే అభి ప్రాయాలు మార్చేసుకుని పెళ్ళాడడానికి" పైకి నవ్వుతూ అన్నా మూర్తికి స్నేహితుడి అదృష్టానికి లోలోపల కాస్త యీర్ష్య కలిగింది,

"ఓ!....అదెంత సేపు. మా వనితకి చెపితే. ఆవిడ మిత్రకోటిలో ఎవరినో వెతికి పట్టుకుంటుంది రేపీపాటికి!"

కారు రోడ్లని చీల్చుకుంటూ ప్రసాద్ చేతిలో మెలికి తిరుగుతూ పాములా వెళ్ళిపోతూంది. హఠాత్తుగా డ్రైవ్ చేస్తున్న ప్రసాద్ చేతుల మీద దృష్టిపడిన మూర్తి కాస్త కలవరపడ్డాడు. పచ్చగా వుండే ప్రసాద్ రంగేమిటి యింత నల్లగా అయిపోయింది, యింత సేపూ తను గమనించనే లేదు! ప్రసాద్ మొఖంలోకి చూసిన మూర్తి ఆశ్చర్యపోయాడు. ఆ రంగు ఏమయింది! కళ్ళ క్రింద నల్లమచ్చలు ఏర్పడ్డాయి మనిషికూడా చాలా తగ్గిపోయాడు. మొఖంలో వెలుగే పోయింది. నవ్వుతూ మాట్లాడుతున్నా ఆ మొఖంలో కళ లేదు. యిదివరకు లాగ, చాల మార్పు వచ్చింది ప్రసాద్‌లో! అనుకున్నాడు మూర్తి ఆ మాట అడగకుండా వుండలేక పోయాడు మూర్తి.

"బాగుంది రా! ఎప్పుడో చీకు చింత లేని రోజుల్లోలాగ బాధ్యతలు, బరువులు నెత్తిన పడ్డాకకూడా ఎలా వుంటాం" తేలిగ్గా అన్నాడు ప్రసాదు.

కారు మలుపుతిరిగి యిల్లు సమీపిస్తుండగా మూర్తి కాస్త సబిడియంగా అన్నాడు. "ఒరేయ్, నేను రేపు వస్తాలేరా? ఇవాళ మీ ఆనందానికి అడ్డుగా మధ్య నేనెందుకు. ఇంకోరోజు వస్తాలే."

"అదేం కుదరదు. నా దగ్గర నీకు మొహమాటం యేమిటి? నీకు వనితని పరిచయం చేస్తాను. ఇవాళ మా పెండ్లి విందు భోజనం తినిపించి గాని వదులుతానా?"

కారు ఓ గేటులోంచి దూసుకుని పోర్టికోలో ఆగింది. కారు హారను వింటూ వనిత లోపల్నించి వస్తుందేమోనన్న ఉత్సుకతతో కారులోంచే వంగి చూశాడు మూర్తి. వనిత రాలేదుగాని ఓ నౌకరు మాత్రం పరిగెత్తుకు వచ్చాడు హారన్ విని.

"ఈ సామానులు అన్నీతీసుకువెళ్ళి బెడ్‌రూమ్‌లో పెట్టు!" "రా...."

దిగరా.... ఏమిటి చూస్తున్నావు!" నౌకరుని ఆజ్ఞాపించి, మూర్తిని లోపలికి ఆహ్వానిస్తూ దారితీశాడు ప్రసాద్.

"కూర్చో... వనితని పిలుచుకువస్తాను" డ్రాయింగ్ రూములో సోఫాలో కూర్చోపెట్టి లోపలికి వెళ్ళాడు ప్రసాద్.

డ్రాయింగ్ రూము డైనింగు రూము కలిపిన ఆ పెద్ద హాలుని రెండుభాగాలుగా ఓ నైలాను కర్టెనువిడదీస్తూ వ్రేలాడుతూంది. డ్రాయింగు రూములో సోఫాలు పొందికగా అమర్చబడిన పుస్తకాల షెల్ఫు. దానిమీద డెకరేషన్ పీసెస్.... గుమ్మాలకి, కిటికీలకి అందమైన తెరలు ... వాజుల్లో అమర్చబడిన పూలు.... గోడలని ముచ్చటగా వున్న రెండు పెయిటింగులు, ఎగిరే పక్షులు.... డైనింగు రూములో నిగనగ లాడే డైనింగ్ సెట్. ఓ మూల ఫ్రిజిడేరు... నీట్‌గా అమర్చబడిన క్రోకరీ.... అంతా చూస్తూ యింటి పొందికని, యింటి యిల్లాలి టేస్టుని మెచ్చుకున్నాడు మూర్తి.

"ఉండరా.... వనిత స్నానం చేస్తూంది.... కూర్చో వస్తుంది...." యింట్లోంచి తెల్లపైజామా, లాల్చీలతో వచ్చి అన్నాడు ప్రసాద్.

"అప్పుడే డిన్నరుకూడా చేసేసింది" డైనింగ్‌టేబిల్‌మీద అమర్చిన గిన్నెల మూతలు తీసి చూస్తూ, "ఓ యివాళ అన్నీ నా కిష్టమయినవే చేస్తుంది. సాంబారు, కొబ్బరి పచ్చడి, బంగాళదుంపల వేపుడు, సేమ్యా పాయసం. ఆవడలు, ఒరే అద్భుతం, నీవు వనిత వంట రుచిచూస్తే మరి వదలవు."

"అన్నట్టు కాస్త కాఫీ తీసుకుంటావా? ఏకంగా భోజనం చేసేద్దామా?"

"వద్దు కాఫీ, ఇప్పుడేం కాఫీ! ఏడుగంట లవుతూంది" మూర్తి వాచి చూసుకుంటూ అన్నాడు.

"అయితే కాసేపు కూర్చోరా, వస్తాను. కాస్త పనుంది" ఆరోజు పేపరు అందించి లోపలికి వెళ్ళాడు ప్రసాద్.

చేతికందిన పుస్తకాలు, వీక్లీలు తిరగేస్తూ కూర్చున్న మూర్తి

దృష్టి పుస్తకంమీద లగ్నంకాలేదు. ఎంత తొందరగా ప్రసాద్ వర్ణించిన ఆ అందగత్తెను చూస్తానా అని మనసు ఆత్రుత పడసాగింది. ఏ చిన్న చప్పుడయినా, గాలికి పరదా కదిలినా ఆ రాబోయే అందగత్తెకోసం ఆరాటంగా చూసేవాడు. మూర్తి ఆత్రుతకి తగ్గట్టువచ్చి అరగంట గడిచినా ఆ సౌందర్యవతి దర్శనం లభించలేదు.

మూర్తికి విసుగనిపించింది ఆ నిరీక్షణ. ఆమె స్నానం, ముస్తాబు యింకా పూర్తి అవలేదులావుంది. భార్యని పూర్తి మేకప్‌తోగాని తన కంట బడనీయడు గాబోలు! ఆమె మాట దేముడెరుగు. ప్రసాద్‌కూడా లోపల కెళ్ళి కూర్చున్నాడేమిటి! విసుక్కున్నాడు మూర్తి.

ఎంత అన్యోన్య దంపతులయితే మాత్రం యింటికి వచ్చిన అతిధిని మరచిపోయి భార్య కొంగుపట్టుకు కూర్చోవాలా?

బెడ్‌రూంలోంచి గాబోలు ఏదో సెంట్ పరిమళం గుప్పుమంది. ఆ వెనువెంటనే అగరువత్తుల సువాసన, లైట్‌గా మల్లెల పరిమళం. ఒకదాని వెంట ఒకటి పరిమళం ఇల్లంతా అలముకుంది. సన్నగా ఏదో మ్యూజిక్ రేడియోలోంచి వినబడుతూంది.

నవ్వుకున్నాడు మూర్తి. బెడ్‌రూము అలంకరణ చేస్తున్నట్లున్నారు? వెడ్డింగ్ యానివర్సరీ అంటే అక్షరాలా మొదటిరోజులా అన్నీ జరిపిస్తారుగాబోలు. పెళ్ళిరోజు గుర్తుకు తెచ్చుకుంటారులావుంది. పెళ్ళయి రెండేళ్ళు నిండినాగూడా యింత అన్యోన్యంగా, అనురాగంతో నూతనత్వం చెడకుండా యెంతమంది నిలుపుకోగలరు? ఎంత అదృష్టవంతుడు ప్రసాద్! సిరిసంపదలు, హోదా, చక్కని అనుకూలవతి అయిన భార్య. ఎంతమందికి లభ్యమవుతుంది యింతటి అదృష్టం.

కూర్చుని, కూర్చుని విసుగుపుట్టిన మూర్తి లేచి పచార్లు చేస్తూ గోడలని పెయింటింగులు, షెల్ఫులో పుస్తకాలని పరిశీలించాడు. బయటికి వెళ్ళి గార్డెనులో అయిదునిమిషాలు తిరిగివచ్చాడు.

అప్పటికీ ప్రసాద్‌కాని, ఆమె దర్శనంకాని లభ్యంకాకపోవడంతో

సహనం కోల్పోయాడు మూర్తి. ఏమిటి తనని మరచిపోయాడా ఏమిటి? తనిక్కడ వున్న సంగతే మరిచిపోయినట్లున్నాడు? ఇంటిలో మాటయినా వినపడదేం! తలుపులు బిగించుకుని యిద్దరూ యీ లోకాన్నే మరచి పోయారా?

ఛా ఛా, తను తప్పుపని చేశాడు. ఇవాళ తను రావడం చాలా పొరపాటు చేశాడు. వాళ్ళింత పట్టింపుగా, ఆనందంగా అన్నీ జరుపుకుంటున్న వారి సంతోషానికి అడ్డుగా తను రావడం పొరపాటు చేశాడు. బలవంతం పెట్టి తీసుకొచ్చిన ప్రసాద్‌మీద కోపం ముంచుకువచ్చింది మూర్తికి.

తీసుకొచ్చిన మనిషి ఇదేం మర్యాద? ఇదేం సభ్యత? ఆ భార్యామణి సాంగత్యంలో ఇంటికి వచ్చిన మనిషినే మరచిపోవడం! ఎంత అందగత్తె అయితే మాత్రం తనలాంటి స్నేహితుడినే మరచిపోతాడా? రానీ, గట్టిగా చీవాట్లు పెట్టాలి. మానర్‌లెస్ బ్రూట్!

గదిలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ కనిపించని ప్రసాద్‌మీద కారాలు, మిరియాలు నూరేడు మూర్తి.

'పోనీ వెళ్ళిపోదామన్నా చెప్పకుండా వెళ్ళిపోవడం ఏం మర్యాద? అసలు మనిషి కనిపిస్తేగదా చెప్పడానికయినా! పోనీ లోపలికి వెళ్ళి చెప్పేస్తే! ఎంత స్నేహితుడయితే మాత్రం బెడ్‌రూమ్‌లోకి వెళ్ళడం ఏం సభ్యత! అందులో ఇద్దరూ ఏ స్థితిలో ఉంటారో అక్కడ?'

ఏం చెయ్యాలో తోచని స్థితిలో విసుక్కుంటూ అటు ఇటు తిరిగాడు మూర్తి. వచ్చి అప్పుడే గంటయింది. ఎవడన్నా బంట్రోతయినా కనిపిస్తే చెప్పి వెళ్ళిపోవచ్చు! కర్టెను కాస్త తొలగించి యెవరయినా కనిపిస్తారేమోనని చూస్తున్న మూర్తికి బెడ్‌రూమ్‌లో ఏదో చప్పుడు.... వెనువెంటనే ప్రసాద్.

"వనితా! వనీ? అయ్యో! ఏమిటిది? ఏమయింది, ఏమయింది. మాట్లాడు వనితా. అయ్యయ్యో! ఏమిటిది వనీ! నొప్పా! గుండెల్లో

నొప్పా!" ఆదుర్దాగా. ఆందోళన నిండిన ప్రసాద్ కేకలకి స్థంభించిపోయాడు మూర్తి. ఏం జరిగిందో తెలియక, వెనువెంటనే సుడిగాలిలా బయటికివచ్చిన ప్రసాద్, వంటింటిలోంచి అప్పుడే వచ్చి నిల్చున్న నాయర్‌ని చూసి, "నాయర్! అర్జంటుగా డాక్టర్ బెనర్జీకి ఫోన్‌చేసి తక్షణం రమ్మను. అమ్మగారికి గుండెనొప్పి వచ్చి తెలివితప్పి పడిపోయారని చెప్పు. అర్జంటుగా రమ్మని.... వెంటనే ఫోన్‌చెయ్యి" మనిషి నిలువెల్లా వణికిపోతూ, అక్కడే తెల్లబోయి చూస్తున్న మూర్తిని గమనించనయినా గమనించకుండా వచ్చినంత వేగంగానూ లోపలికి వెళ్ళిపోయాడు

"ప్రసాద్! ప్రసాద్.. ఏమయింది? ఏమిటయింది?" ఆదుర్దాగా అడుగుతూ వెంట వెళ్ళి గది గుమ్మంలో నిలబడి చుట్టూ చూసిన మూర్తి చకితుడయిపోయాడు.

గదినిండా పాలవెన్నెలలాటి ట్యూబ్‌లైట్ కాంతి నిండివుంది. పాల నురుగులాటి ప్రక్కలనిండా అప్పుడే విచ్చిన మల్లెలు జల్లివున్నాయి. మంచాలనిండా మల్లెల దండలు వ్రేలాడుతున్నాయి. గదినిండా అగరువత్తుల ధూపం పల్చగా పరుచుకొనివుంది. ఓ టేబిల్‌మీద ప్లేట్లలో సాయంత్రం బజారునుంచి తెచ్చిన స్వీట్సు అమర్చబడి వున్నాయి. గదంతా సెంటు, మల్లెలు, అగరువత్తుల సువాసనలు కలిసి అదోరకం సువాసనతో నిండి ఉంది. డ్రెస్సింగు టేబిల్ స్టూలుమీద సాయంత్రం ప్రసాద్ కొన్న పట్టు చీర కుప్పలా పడివుంది. క్రింద కూర్చుని చీరలో మొహం దాచుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్నాడు ప్రసాద్.

ఆదుర్దాగా గది అంతా కలయ చూశాడు మూర్తి. ఏది ఆమె? ఎక్కడుంది? ఏమిటయింది? అయోమయంగా గుమ్మం అవతల నిల్చున్న నాయర్‌వంక చూశాడు. ఏ గాభరా లేకుండా నిల్చుని చూస్తున్న నాయర్‌ని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి. "అదేమిటి అలా చూస్తూ నిల్చున్నావు? ఇంకా డాక్టర్‌కి ఫోన్ చెయ్యాలేదూ?" ఆదుర్దాగా అడిగాడు అవతలకి వెళ్ళి.

"ప్చ్! డాక్టరెందుకండీ డాక్టరువచ్చి ఏం చేస్తాడు?" తెల్లబోయి చూశాడు మూర్తి "డాక్టరువచ్చి ఏం చేస్తాడేమిటి? నీవే ఓ డాక్టరులా మాట్లాడుతున్నావేమిటి? వెళ్ళు, వెంటనే ఫోను చెయ్యి" నాయర్ ధీమాకి పట్టరాని కోపం వచ్చి ఆజ్ఞాపించినట్లు అన్నాడు మూర్తి.

"మీకు తెలియదు బాబూ అయ్యగారి సంగతి! ఆయన కివాళ మతుండదు. ఆయన ఇవాళ ఏం చేస్తారో ఆయనకే తెలియదు" అదో రకంగా అన్నాడు నాయర్. "ఆ మాటలన్నీ మనం పట్టించుకుంటే ఎలా?"

"ఏమిటి?"

"అవునుసార్! అమ్మగారుపోయి అప్పుడే సరిగ్గా యివాళకి రెండేళ్లు అయిపోయింది. ఈరోజు సరిగా యిదే వేళకి పోయారు అమ్మగారు గుండె నొప్పి వచ్చి. బాబుగారికి యిదో పిచ్చి! సరిగ్గా ఆ రోజులా అంతా తు. చ. తప్పకుండా చేస్తారు" విషాదంగా అన్నాడు నాయర్.

"నిజమా?...నిజంగా ఆమె చనిపోయిందా?" వెర్రివాడిలా చూస్తూ అడిగాడు మూర్తి. మౌనంగా తలవూపాడు నాయర్.

స్థాణువై నిలబడిపోయాడు మూర్తి. గదిలోంచి హృదయ విదారకంగా ప్రసాద్ ఏడుపు వినిపిస్తోంది. మూర్తి గుండెలు బరువెక్కాయి.

(అంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నుండి గ్రహింపబడినది)